కూటమి ప్రభుత్వంతోనే నవ్యాంధ్ర నిర్మాణం: ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వంతోనే నవ్యాంధ్ర నిర్మాణం సాధ్యమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తీసుకొస్తున్న సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఢిల్లీలో ఉన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా మంగళవారం ఓ ప్రకటనలో స్పందించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులేస్తున్నారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల అమలతో ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నారని, ఏపీ ప్రగతికి బాటలు వేసారని కొనియాడారు.

మామిడి రైతులను ఇబ్బంది పెట్టొద్దు..

మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులకు కలెక్టర్ సూచన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మామిడి గుజ్జు పరిశ్రమలకు మామిడి తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డితో కలిసి గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్, టాఫ, గంగాధర నెల్లూరు మండలంలో ఉన్న జైన్ మామిడి గుజ్జు పరిశ్రమలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మామిడి గుజ్జు పరిశ్రమలకు మామిడి తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మామిడి గుజ్జు పరిశ్రమలు పరిశీలించి అక్కడున్న మామిడి రైతులతో మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయని రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మామిడి గుజ్జు పరిశ్రమ యాజమాన్యాన్ని,అక్కడ ఉన్న అధికారులకు సూచించారు. మామిడిని గుజ్జు పరిశ్రమలకు తరలించే రైతుల వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. మామిడికి మద్దతు ధరకు సంబంధించిన బోర్డును ఏర్పాటు చేయాలని షిఫ్ట్ లు వారీగా ప్రతి మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద ఇద్దరు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. మామిడి తీసుకొచ్చిన రైతుల నుండి ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా వివరాలు సంబంధిత ఫోన్ నెంబర్లు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట మండల తహశీల్దార్లు డీటీలు, ఉద్యానశాఖ అధికారులు, రైతులు, మామిడి గుజ్జు పరిశ్రమల సిబ్బంది పాల్గొన్నారు.

తోతాపూరి కొనుగోలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్

'సోలార్ మేళా' అవగాహన సదస్సులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా రాయితీతో సోలార్ రూఫ్ టాఫ్ నిర్మించుకోవడంపై మరింత అవగాహన కల్పించడంలో భాగంగా క్లస్టర్ స్థాయిలో సమావేశాలను నిర్వహించి విరివిగా సోలార్ మేళా పేరుతో అవగాహనా సదస్సుల నిర్వహణకు చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో ఎస్ఈ, నెడ్ క్యాప్ అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం అమలుకు సంబంధించి ట్రాన్స్ కో, నెడ్ క్యాప్, జిల్లా పరిషత్, డిఆర్డిఏ, బ్యాంకర్‌లు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలసి జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచడానికి సోలార్ రూఫ్ టాఫ్ ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్‌తో ఇంటి అవసరాలను తీర్చుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌కు అమ్ముకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చునని, ఈ విషయంపై అవగాహన పెంచడంలో భాగంగా క్లస్టర్ స్థాయిలో విరివిగా సమావేశాలు నిర్వహించాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ మొదట మొత్తం నగదును చెల్లించి తరువాత ప్రభుత్వం రాయితీ పొందే అంశంపై వినియోగదారులకు ఆసక్తి తగ్గుతున్నదని, ఇందుకు గానూ బ్యాంకులలో రుణ సదుపాయం ద్వారా నెలవారీ వాయిదాలలో చెల్లింపులు చేసేలా బ్యాంకర్లు రుణాల మంజూరుకు చొరవ చూపాలన్నారు. ప్రధానంగా ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు ఇతర రాయితీ వివరాలను పూర్తి స్థాయిలో నివృత్తి చేసేందుకు మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల స్థాయి కమిటీలో డిఆర్డిఏ ఏపిఓలు, ట్రాన్స్‌కో ఏఈలు, బ్యాంకర్లు ఒక కమిటీగా ఏర్పాటు కావాలన్నారు. అలాగే గ్రామస్థాయిలో కూడా సంఘాలలోని మహిళలకు స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంకుల ద్వారా అందించేందుకు చర్యలు చేపట్టడంలో భాగంగా కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన పెంచడంలో నిమగ్నం కావాలన్నారు. శాఖలన్నీ సమన్వయంతో పనిచేయడం ద్వారా సూర్య ఘర్ పథకానికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయగలరని, ఆ దిశగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్ కో ఎస్ఈ ఇస్మాయిల్, నెడ్ క్యాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ అబ్దుల్ రయాజ్, జెడ్పి సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్ రావు, డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, ఎల్‌డిఎం హరీష్, వివిధ బ్యాంకు శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రధాని సూర్య గర్ యువజన పథకంపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

వరుసగా ఏనుగుల దాడులు

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు వరుస దాడులకు పాల్పడుతూ రైతులవ్యవసాయ పంటలను తొక్కి నాశనం చేస్తున్నాయి. మంగళవారం తెల్లవారు జామున దేవలంపేట పంచాయతీ కుమ్మరిపల్లికు చెందిన రైతులు వెంకటాచలం, కృష్ణయ్య, ధర్మేంద్రలకు చెందిన టమాటా, మామిడి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేసి రైతులకు తీవ్రనష్టాన్ని కలిగించాయి. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు మహ్మద్ రఫీ, కృష్ణమూర్తి నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించారు.

ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమాటా పంట

ఇతర రాష్ట్రాల నుండి 'తోతాపురి' జిల్లాలోకి రాకుండా

నిఘా పెంచండి

పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోయండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఇతర రాష్ట్రాల నుండి వచ్చే తోతాపురి రకం జిల్లాలోకి రాకుండా నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, గుడిపాల మండలంలో ఫుడ్ అండ్ ఇన్,తన గంగాధర్ నెల్లూరు మండలంలో జైన్ ఫ్యాక్టరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా గుడిపాల మండలంలో ఫుడ్ అండ్ ఇన్ కంపెనీలో తోతాపురి మామిడి రకంకు సంబంధించి ప్రారంభమైన మామిడి సరఫరాను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గుడిపాల మండలం చిత్తూరు జిల్లాకు సరిహద్దుగా ఉండడం వల్ల ఇతర రాష్ట్రాల నుండి వచ్చే తోతాపురి మామిడి రకాన్ని జిల్లాలోకి రానికుండా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో ప్రాసెసింగ్ కంపెనీల యజమానులు కూడా స్థానికంగా ఉన్న తోతాపురి మామిడిని కొనుగోలు చేసే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తోతాపురి మామిడి ధర నిలకడగా ఉంటుందని రైతులు ఆందోళన చెందకుండా పక్వానికి వచ్చిన కాయల్ని మాత్రమే కోసి ప్రాసెసింగ్ కంపెనీలకు తరలించాలని ఈ విషయంలో రైతులు పాటించాలన్నారు. రైతులు ప్రాసెసింగ్ కంపెనీలకు మామిడిని తరలించే సందర్భంలో వారి పేరును కచ్చితంగా నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం ద్వారా అందించే రాయితీని పొందేందుకు రైతులు ప్రాసెసింగ్ కంపెనీల వద్ద ఉన్న ఆర్ఎస్‌కె ఇన్చార్జిల దగ్గర పేరు కచ్చితంగా నమోదు కావాలన్నారు. దీనితోపాటు రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌బుక్ జిరాక్స్ ఈక్రాప్ బుకింగ్ అక్నాలెడ్జ్మెంట్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తోతాపురి మామిడికి ప్రకటించిన మద్దతు ధర కిలోకి రూ.12లలో 8 రూపాయలు ప్రాసెసింగ్ కంపెనీల వాళ్ళు కచ్చితంగా చెల్లించాలని మిగిలిన 4రూపాయలు ప్రభుత్వం చెల్లించడం జరుగు తుందన్నారు. గంగాధర్ నెల్లూరు మండలంలో జైన్ ఫ్యాక్టరీ లో రెండు యూనిట్ ఉండగా రెండో యూనిట్‌ను కూడా ప్రారంభించే విషయాన్ని పరిశీలించాలన్నారు. చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, సంబంధిత అధికారులు రైతులు పాల్గొన్నారు.

స్లో మోటార్ సైకిల్ రైడింగ్ పోటీల నిర్వహణ

రేపటి నుంచి 21వరకు రిజిస్ట్రేషన్లు : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

మోటార్ సైకిల్ నడిపే వారిలో సహనాన్ని, మోటార్ సైకిల్ బ్యాలెన్స్ చేసే సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడం కోసం స్లో మోటార్ సైకిల్ రైడింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటన తెలిపారు. 100 మీటర్స్ దూరాన్ని ఉపయోగించుకొని స్టార్టింగ్ లైన్ నుండి ఎండింగ్ లైన్ వరకు గల దూరాన్ని కాలు కింద మోపకుండా చిట్టచివర ఎవరైతే లైన్‌ను టచ్ చేస్తారో వారిని ఆ రౌండ్ విన్నర్‌గా పరిగణిస్తారని తెలిపారు. ప్రతి బ్యాచ్‌లో కొంత మందిని అనుమతించి పోటీలు నిర్వహిస్తారని, వచ్చిన పోటీదారుల సంఖ్యను బట్టి రౌండ్ల సంఖ్య నిర్ధారించబడుతుందని ఇలా చివరి రౌండ్‌లో పోటీపడి ఒకటి, రెండు, మూడు స్థానాల్లో గెలుపొందిన వారికీ వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు చొప్పున బహుమతిగా ప్రధానం చేయబడుతుందన్నారు. 18 సంవత్సరాలు పూర్తి అయి ఉండి, సరైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన స్త్రీ, పురుషులు ఇరువురు అర్హులని తెలిపారు. వాహనానికి సంబంధించిన సరైన రికార్డ్స్ కలిగి ఉండాలని, వాహనం పని సామర్థ్యం కలిగి ఉండి, హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. రియర్ సైడ్ మిర్రర్స్, హెడ్ లైట్, మోటార్ సైకిల్‌పై ఎటువంటి పెండింగ్ చలానాలు ఉండకూడదని తెలిపారు. ఈనెల 11వ తేదీ బుధవారం నుంచి 21వ తేదీ వరకు ఆసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని, చిత్తూరు ట్రాఫిక్ సిఐ వాట్స్‌అప్ నెంబర్ 9491074515కు వివరాలు పంపి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలు నిష్ణాతులైన వారి పరివేక్షణలో నిస్పక్షపాతంగా, ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించబడుతుందని అధిక సంఖ్యలో పోటీదారుల పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

తల్లిదండ్రులు లేని పిల్లలను ఆదుకున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక 28వ డివిజన్ వినాయకపురంలో మైనారిటీ ఒంటరి వృద్ధ మహిళ ఖుషిద నివాసముంటున్నారు. ఖుషిదాకు కొడుకుకోడలు ఈమధ్య అనారోగ్యంతో మరణించారు. వారికి ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు. వృద్ధురాలైన ఖుషిదకు పిల్లల పోషణ కష్టమై వినాయకపురం డివిజన్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాస్‌కి సహాయం చేయాలని వేడుకున్నారు. దీంతో ఆయన గత నెల కలెక్టర్‌కి విషయం చెప్పడం జరిగింది. స్పందించిన కలెక్టర్ పిల్లలకు రూ.50వేలు చెక్కును అందించారు. అలాగే వృద్ధురాలికి పింఛను, ఇల్లు, పిల్లల చదువుకు కూడా తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళికారి సాంబశివారెడ్డి, సత్య, రెడ్డిమస్తాన్, షంషేర్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

హై రోడ్డు విస్తరణ పనులు వేగవంతం



రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. 100 అడుగుల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సహాయ సహకారాలతో నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాలతో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర నేతృత్వంలో మంగళవారం కీలకమైన పనులు జరిగాయి. చిత్తూరు– తిరుపతి రోడ్డులో కట్టమంచిలోని ద్రౌపది అమ్మగుడి వద్ద వద్దనున్న జరుగుతున్న పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించడం జరిగినది.

ఏడాది పాలనలో మహిళలపై అఘాయిత్యాలు

అంబేద్కర్ విగ్రహం ఎదుట వైసిపి నిరసన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మహిళలు, యువతులపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోయాయంటూ మంగళవారం వైసిపి మహిళలు స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైసిపి మహిళా విభాగం నాయకులు మాజీ ఎమ్మెల్యే లలితా థామస్, గాయత్రీ దేవి, హరణి రెడ్డి మాట్లాడుతూ ఓటమి ప్రభుత్వ ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల మహిళలు, యువతులపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగాయన్నారు. మహిళలకు రక్షణగా ఉన్న దిశా చట్టాన్ని కూటమి ప్రభుత్వం నీరుగాడ్చిందన్నారు. ఎన్నికల సందర్భంగా మహిళలకు రక్షణ కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.

మే నెలలో పది శిశు మరణాలు

నివారణకు యాక్షన్ ప్లాన్ : నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు

శిశు మరణాలపై సమీక్షిస్తున్న నోడల్ అధికారి హనుమంతరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆదేశాలతో జిల్లా శిశు మరణాల టాస్క్ ఫోర్స్ కమిటీ రివ్యూ నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రత్యక్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ గర్భిణీ కాన్పు సమయంలో కానీ పుట్టిన తర్వాత ఒక సంవత్సరం లోపు చనిపోయే పిల్లలు శిశు మరణాల కిందకు వస్తుందని, మే నెలలో మొత్తం 10 మరణాలు ఉన్నాయని, ఇవన్నీ కూడా హాస్పిటల్‌లో చనిపోవడం జరిగిందని తెలిపారు. ఇందులో పిఈఎస్ కుప్పం హాస్పిటల్‌లో ఐదు మరణాలు, తిరుపతి రుయా హాస్పిటల్‌లో నాలుగు మరణాలు, చిత్తూరు జిహెచ్‌లో ఒకటి నమోదయ్యాయని తెలిపారు. గర్భస్థ సమయం నుంచే బిడ్డకు ఎలాంటి పౌష్టికాహార లోపం లేకుండా ఉండేందుకు మొదటి నుంచి జాగ్రత్తలు తీసుకునే విధంగా యాక్షన్ ప్లాన్ వేసుకొని ఆరోగ్య సేవలు అందించాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ నిర్ణయించిందన్నారు. అలాగే బిడ్డ పుట్టినప్పటినుంచి బిడ్డకు ఇవ్వవలసిన వ్యాధినిరోధక టీకాలు సకాలంలో ఇచ్చినట్లయితే అంటూ వ్యాధులు ప్రబలకుండా బిడ్డ ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. ఈ దిశగా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు లత, పూజ, ప్రశాంతి, అనిల్ కుమార్, సింధూర, అనూష, వెంకటేశ్వరీ, మోహన్‌బాబు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఐసెర్'లో అగ్ని కీలలు

కెమిస్ట్రీ ల్యాబ్‌లో ఎగిసిపడిన మంటలు
అదుపు చేసిన ఫైర్ సిబ్బంది
తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలో ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ తిరుపతి (ఐసెర్)లో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఐసెర్ నాల్గవ అంతస్థులో ఉన్న కెమిస్ట్రీ ల్యాబ్ లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. మంటల ధాటికి పెద్దపెద్ద శబ్దాలు ఏర్పడి అగ్నికీలలు, పొగ బయటకు రావడంతో చుట్టుపక్కల వారు ఉలిక్కి పడ్డారు. వెంటనే తేరుకున్న ఐసెర్ యాజమాన్యం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. శ్రీకాళహస్తి, వెంకటగిరికి చెందిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తేవడంలో విజయవంతమయ్యారు. ఐసెర్‌లో తరగతులు జరుగుతుండగానే అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఓ శిక్షకుడికి స్వల్ప గాయాలైనట్లుగా చెబుతున్నారు. విద్యార్థులకు ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. అప్రమత్తంగా ఉన్న విద్యార్థులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. ఐసెర్‌లో సుమారు వెయ్యి మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. నాల్గవ అంతస్థులోని కెమిస్ట్రీ ల్యాబ్ లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై ఐసెర్ యాజమాన్యం మీడియా ప్రకటనను విడుదల చేసింది. జరిగిన అగ్నిప్రమాదం చాలా చిన్నదనీ, ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదనీ, నష్టం కూడా వాటిల్లలేదని స్పష్టం చేసింది. తినుబండారాలు, రిఫ్రిజిరేటర్లు మాత్రమే అగ్నిప్రమాదంలో దెబ్బతిన్నాయని పేర్కొంది. మంటలను అదుపు చేయడంలో సహకరించిన శ్రీకాళహస్తి, వెంకటగిరి అగ్నిమాపక సిబ్బందికి ఐసెర్ డైరెక్టర్ భట్టాచార్య కృతజ్ఞతలు తెలిపారు. జరిగిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఐసెర్ లో జరిగిన అగ్ని ప్రమాద దశ్యాలను చిత్రీకరించేందుకు వెళ్లిన విలేకరుల పట్ల అక్కడే ఉన్న సెక్యూరిటీ సూపర్వైజర్ అనుచితంగా ప్రవర్తించారు. పరుష పదజాలం వాడి దూషించారు. అక్కడితో ఆగకుండా ఓ విలేఖరి మొబైల్ ఫోన్ తీసుకొని ఆయనే స్వయంగా ఫోటోలను డిలీట్ చేశారు. దీనిపై పాత్రికేయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వ నేతల దౌర్జన్యాలను ఎదుర్కొంటాం

మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణస్వామి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ నేతలు దౌర్జన్యాలు పెరిగిపోయాయని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ నాయకులు సూపర్ సిక్స్ పథకాల అమలులో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసులు రావును అరెస్టు చేయడం అత్యంత దారుణమన్నారు. దేశపూర్వకంగా వైసిపి నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ బెదిరింపులకు పాల్పడడం తగదని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తామన్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. చిత్తూరు నియోజకవర్గ ఇన్చార్జి ఎంసి విజయానంద రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో ఓట్ల శాతం పెరిగిందని గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కసారిగా అత్యధికంగా ఎలా ఓట్ల శాతం పెంచుకొని కూటమి ప్రభుత్వం ఈవీఎంల టాంపరింగ్‌తో అధికారాన్ని చేపట్టిందని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లలితా థామస్, మహిళా నాయకురాలు హరణి రెడ్డి పాల్గొన్నారు.

తిరుమల అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల కొండల్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం శిలాతోరణం, శ్రీవారిపాదాల దగ్గర మంటలు చెలరేగాయి. శ్రీవారి పాదాలకు వెళ్లే దారిలో ఉన్న అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. వెంటనే ఫైరింజన్ల సాయంతో అక్కడకు చేరుకున్నారు. రెండు ఫైరింజన్లతో మంటలను నియంత్రించారు. అయితే మంటలు చెలరేగడానికి గల కారణాలు ఏంటనేదీ తెలియాల్సి ఉంది. దీనిపై అధికారులు ఆరా తీస్తున్నారు.

ముంచుకొస్తున్న ముప్పు!

- నివాసాల మధ్యే మురుగునీటి ప్రవాహం
- విష జ్వరాలతో చంటి పిల్లలు గజగజ
- తల్లడిల్లుతున్న పిల్లల తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండలంలోని గుండ్రాజుపల్లి పంచాయతీ మర్రిమాకుల పల్లిలో సరైన మురుగునీటి కాలువలు లేకపోవడంతో గ్రామం మధ్యే మురుగునీరు ప్రవహిస్తోంది..దుర్గంధం వస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దోమలు స్వైర విహారం చేస్తుండడంతో విషజ్వరాల వ్యాపించి భయాందోళనకు గురి చేస్తోంది. గ్రామంలోని చంటి పిల్లలు జ్వరాల బారిన పడడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళనతో తల్లడిల్లు తున్నారు. ముంచు కొస్తున్న ముప్పుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ గ్రామ ప్రజలు వణికి పోతున్నారు. అధికారులు వెంటనే స్పందించాల్సి వుంది.

ముంచుకొస్తున్న ముప్పు!

మండలంలోని గండ్రాజుపల్లి పంచాయతీ మర్రిమాకులపల్లి గ్రామంలో డ్రైనేజ్ కాలువలు లేకపోవడంతో మురుగునీరు, వర్షపు నీరు రోడ్డుపైకి చేరి మడుగులా మారుతున్నాయి. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అటు దోమలు, ఇటు దుర్గంధం గ్రామస్తులను వెంటాడుతూ కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. విష జ్వరాలు ప్రబలుతాయన్న భయాందోళనతో వణికిపోతున్నారు.

నివాసాల మధ్యే మురుగునీటి ప్రవాహం

మర్రిమాకులపల్లి గ్రామంలో మొత్తం 150 కుటుంబాలు ఉంటున్నాయి. ప్రతి వీధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మురుగు కాలువలు ఉన్నా వాటిని శుభ్రం చేయక పోవడంతో చెత్తాచెదారం నిండిపోయి మురుగు నీరు మొత్తం రోడ్లపై ప్రవహిస్తోంది. ఆ దారి వెంట ఇళ్లలోకి వెళ్లాలంటే ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

విష జ్వరాలతో చంటి పిల్లలు గజగజ

నివాసాల మధ్యే మురుగునీరు చేరుతుండడంతో దోమలు అధికమై చంటి పిల్లలు విష జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళనతో తల్లడిల్లుతున్నారు. పెద్దలను సైతం రోగాలు వెంటాడుతున్నాయి. నిత్యం అనారోగ్యంతో ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి జాతీయ రహదారి కేవలం కిలో మీటరు దూరం మాత్రమే వుందని, ఎనిమిది సంవత్సరాలుగా కంకర తోలి వదిలేస్తున్నారు తప్ప పూర్తి స్థాయి రోడ్డు వేసిన పాపాన పోలేదని వాపోతున్నారు. అధికారులు మారినా, పాలకులు మారినా తమ గ్రామం బాగుపడడం లేదని వాపోయారు. ఈ దారి మీదుగా కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా పోతోందని చీకటి పడితే గ్రామానికి వెళ్లడానికి అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా అత్యవసర సమయాల్లో రాత్రి వేళల్లో ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా పడరాని పాట్లు పడాల్సి వస్తోందని వాపోయారు.

మర్రిమాకుల పల్లి మరో వీధిలో మడుగులా నిలిచిన మురుగునీరు

పట్టించుకోని అధికారులు

గ్రామం మధ్యలో మురుగునీటి ప్రవాహం విషయమై అనేకసార్లు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా చూసి వెళ్లారు తప్ప సమస్యను పరిష్కరించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సర్పంచ్‌కు మొరపెట్టుకున్నా తాను పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నానని కార్యదర్శి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని అంటున్నారని

మర్రిమాకుల పల్లి గ్రామ వీధిలో నిలిచిపోయిన మురుగునీరు

తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయడంతోపాటు రోడ్డును బాగుచేయాల్సి వుంది.

మా పిల్లలకు జ్వరం తగ్గడం లేదు..

మా పిల్లలకు వారం రోజులుగా జ్వరంగా వుంది..ప్రతిరోజూ పలని ఆస్పత్రికి వెళ్లి రోజుకు రూ.వెయ్యి నుండి 1500 రూపాయలు వరకు ఖర్చు చేస్తున్నాం.. అయినా జ్వరం తగ్గలేదు.. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు..

- శారదమ్మ, మర్రిమాకులపల్లి గ్రామం.

వారం రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నాం..

మా కుటుంబంలో అందరూ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాం.. స్థానిక డాక్టర్ వద్ద ప్రతి రోజూ వైద్యం చేయించుకుంటున్నాం.. అయినా జ్వరం అదుపులోకి రాలేదు.. భయం వేస్తోంది..!

- మురళి, మర్రిమాకులపల్లి గ్రామం.

కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పట్టణంలోని కెసి ఆస్పత్రి వారు మండల పరిధిలోని వేపూరులో ఉచిత వైద్య శిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరం విజయవంతంగా ముగియడంపై ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మంజునాథ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించిందన్నారు. ఈ శిబిరంలో 350 మంది పాల్గొనగా వారిని పరీక్షించిన వైద్యులు వారి ఆరోగ్యం పట్ల తగిన సలహాలు, సూచనలు అందించారు. వారికి అవసరమైన మందులను సైతం ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూచనలిస్తున్న పులిచెర్ల సీడీపీవో వాణిశ్రీ

పులిచెర్ల సీడీపీవోగా వాణిశ్రీ

ప్రజాశక్తి -రొంపిచర్ల: పులిచెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓగా వాణిశ్రీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పులిచెర్ల ప్రాజెక్టు పరిధిలో సదుం, పులిచెర్ల, రొంపిచర్ల మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాలను సిబ్బంది సహకారంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఆమె ఈ సందర్భంగా అన్నారు. పులిచెర్ల లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. బాల్యవివాహాల గురించి కలిగే అనర్థాలను ఆమె వివరించారు. బాల్య వివాహాల వల్ల మాతా శిశు మరణాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, 18 ఏళ్లలోపు వారికి వివాహం చేయాలని చూస్తే తమకు ఫిర్యాదు చేయాలని, చట్టం ఉల్లంఘించిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపరువైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెనిద్రలో మాట్లాడుతున్న పోలీసులు

పోలీసుల పల్లె నిద్ర

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లెలో పోలీసుల పల్లెనిద్రను చౌడేపల్లి రూరల్ సీఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు పల్లెనిద్ర నిర్వహిస్తున్నట్టు సీఐ తెలిపారు. ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని ఎలాంటి గొడవలు, అల్లర్లు లేకుండా ఒకరికొకరు స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. గ్రామాలు పల్లెలు రాష్ట్రానికి పట్టుకొమ్మలని అలాంటి పల్లెల్లో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉంటే సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎస్ఐ శివ శంకర్ మాట్లాడుతూ మండలం లో శాంతి భద్రత పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో ఉందని ప్రజలు కూడా పోలీసుల బాధ్యతతో శాంతి భద్రతలకు సహకరించాలన్నారు. ముఖ్యంగా పోలీసులతో స్నేహభావాన్ని కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది , గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు

నాలుగు రోజులు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని ఎల్లమరాజు పల్లి సబ్ స్టేషన్లో మరమ్మతులు చేస్తున్న కారణంగా నాలుగు రోజుల విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఈఈ సురేష్ కుమార్, ఏఈ వరదరాజులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో ఎల్లమరాజు పల్లి విద్యుత్ సబ్ స్టేషన్ లో ఈనెల 11 ,12, 13 ,14 తేదీలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలో ఎల్లమ్మరాజు పల్లె, ఠాణా, చెర్లోపల్లె, చెర్లోపల్లి దళితవాడ, పి.బి. అగ్రహారం, వేల్కూరు, చిత్తూరు మండలంలో ఎగువ మాసాపల్లె ,శెట్టిగారిపల్లె, కొత్తూరు, బంగారెడ్డిపల్లె గ్రామాల్లో నాలుగు రోజులు పాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని వారు తెలిపారు.

సీడీపీవో బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న సీడీపీవో పద్మసునంద

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీవోగా పద్మ సునంద బాధ్యతలు స్వీకరించారు. ఈమెగతంలో కార్వేటి నగరం ప్రాజెక్టులో పని చేస్తూ బదిలీపై గంగాధర నెల్లూరుకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీడీపీవో వినతశ్రీ బంగారుపాల్యం ఐసిడిఎస్ ప్రాజెక్టుకు బదిలీపై వెళ్లారు. కొత్తగా విధుల్లో చేరిన పద్మ సునందకు గంగాధర నెల్లూరు ఐసిడిఎస్ కార్యాలయ ఉద్యోగులు స్వాగతం పలికారు.

గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుడిపాల: గుడిపాల మండలం 189 కొత్తపలి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గంగమ్మ జాతరలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు.

గంగజాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

జాతర కోసం గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, స్థానిక నాయకులు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. నడివీధిలో ప్రతిష్టించిన గంగమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బనాయుడు, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, టిడిపి నాయకులు బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, సుమతి, మురళి నాయుడు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక పరిధిలో మంగళవారం జరిగిన పలు గంగమ్మ జాతర ల్లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు వెంగళరావు కాలనీలో ప్రతిష్టించిన గంగమ్మకు హారతి పట్టి తొలి పూజ నిర్వహించారు. అమ్మవారిని దర్శనం చేసుకుని పూజల నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే వారిని శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. మంగళవారం ఎమ్మెల్యే నగరంలోని వైయస్సార్ కాలనీ, చంగ్రాయమిట్ట, తేనెబండ నడి వీధుల్లో ప్రతిష్ఠించిన గంగమ్మను దర్శించుకున్నారు. కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, కాజూరు బాలాజీ, స్థానిక నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదినం

కేక్ కట్‌చేసి బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి -పుంగనూరు: సినీ ప్రముఖులు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్‌టిఆర్ అభిమాన సంఘ అధ్యక్షుడు దుద్యాల అప్పిరెడ్డియాదవ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు చేపట్టారు. కేక్ కట్ చేసి బాలకృష్ణ అభిమానులు, కార్యకర్తలు, టిడిపి నాయకులు ఒకరికొకరు పంచుకొని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పిరెడ్డి యాదవ్ మాట్లాడుతూ ముఖ్యంగా తెలంగాణ ఆంధ్ర రాష్ట్ర ప్రజల సౌకర్యార్థం బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్న తమ అభిమాన నటుడు బాలకృష్ణ జన్మదినం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మరెన్నో జన్మదిన వేడుకలు ఆయన జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రూరల్ అధ్యక్షుడు మాధవరెడ్డి, పట్టణ పై మాన్ కమిటీ సభ్యులు సివిరెడ్డి, శ్రీకాంత్, టీడీపీ నాయకులు ప్రసాద్, మాజీ సర్పంచ్ రమణ, గంగాధర్, గంగరాజు, సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ మహిళా సంఘ అధ్యక్షురాలు బాలినేని కవిత పాల్గొన్నారు.

ఐరాల: ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఐరాల మండలం అగరంపల్లె గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణ అభిమానుల ఆ సంఘం అధ్యక్షులు ఎల్‌బినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీ కేక్ ను కట్ చేసి టిడిపి నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు, ఐరాల మండల మాజీ అధ్యక్షులు గిరిధర్ బాబు, కాణిపాకం దేవస్థానం మాజీ ఆలయ ఛైర్మన్ మణినాయుడు, నందమూరి అభిమానుల సంఘం అధ్యక్షులు ఎల్‌బినాయుడు, అభిమానులు తెల్లగుండ్లపల్లె కిరణ్ చౌదరి, వంశీ, వినయ్, మద్దిపాట్లపల్లె ప్రణీత్, భూమా యశ్వంత్, సాదు దిలీప్, యువకృష్ణ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -పుంగనూరు: అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి కించపరిచిన కొమ్మినేని శ్రీనివాస రావు, కృష్ణం రాజులపై కఠాన చర్యలు తీసు కోవాలని కఠినంగా శిక్షించాలని నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షురాలు బాలినేని కవిత, ప్రచార కార్యదర్శి గోదావరి జ్యోతిలు అన్నారు. వారి వ్యాఖ్యలను ఖండిస్తూ టిడిపి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఇందిరా సర్కిల్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనుచిత వ్యాఖ్య లు చేసిన వారిపై తీసుకోవాలని కోరుతూ తహశీల్దారు రాము కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నుండి మహిళలు తరలివచ్చారు.

రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండలంలోని సచివాలయాల పరిధిలోని రైతుసేవా కేంద్రంలో రాయితీ వేరుశనగ విత్తనాలు సిబ్బంది రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. రొంపిచర్ల మండలానికి సంబంధించి ఖరీఫ్ పంటల సీజన్‌కు 715 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు అయ్యాయని, రైతులకు సబ్సిడీ పోను 1,674 రూపాయలకు ఒక బస్తా విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు అగ్రికల్చర్ ఆఫీసర్ సుధారాణి తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బోడపాటి కుటుంబ సభ్యులను కలిసిన ఎమ్మెల్యే భానుప్రకాష్

బోడపాటి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన బోడపాటి సుబ్రహ్మణ్యం నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు బోడపాటి ఆనంద నాయుడు, బోడపాటి లోకనాథం నాయుడులను నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ మంగళవారం పరామర్శించారు. సుబ్రహ్మణ్యం నాయుడు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. కాగా నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్ తండ్రి, మాజీ మంత్రి గాలి ముద్దు కృష్ణమనాయుడుకి మండలంలో ప్రతి గ్రామంపై పట్టువుంది. దీంతో అభిమానులు ఉన్నారు. భాను ప్రకాష్ వస్తున్న సమా చారంతో మండలంలోని పలువురు నాయకులు, ప్రజలు నగరి ఎమ్మెల్యేని చూసేందుకు వచ్చారు. అనంతరం సాన కుప్పం గ్రామంలో జాతర సందర్భంగా పూజలో పాల్గొన్నారు. టిడిపి మాజీ మండల అధ్యక్షుడు రాజేంద్ర నాయుడు నివాసంలో కాసేపు గడిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు గంధమనేని రాజశేఖర్ నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు రాజేందర్ నాయుడు, ఝాన్సీ భాస్కర్ నాయుడు, నాయకులు బాలాజీ నాయుడు, వేమన నాయుడు, తులసినాయుడుతోపాటు కార్వేటినగరం మండల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

భానోదయ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని ఎట్టేరి గ్రామంలోని శ్రీ భానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు విద్యార్థులు నలుగురికి షైనింగ్ స్టార్ అవార్డ్స్‌తో పాటు డబ్బు తోడ్పాటును మంత్రి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ సమిత్ కుమార్, ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చేతుల మీదుగా విద్యార్థులు మంగళవారం అందుకున్నారు. గంగాధర నెల్లూరు మండలం శ్రీ భానోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదివే నలుగురు విద్యార్థులు మహిమ, కుమార్, జోష్ణ , వైష్ణవి పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు కైవసం చేసుకున్నందున వారి నలుగురికి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో షైనింగ్ అవార్డ్స్ తో పాటు ఒక్కొక్కరికి రూ.20వేలు ఆర్థిక తోడ్పాటును మంత్రి , ప్రభుత్వ విప్ కలెక్టర్‌చే అందుకున్నారు. ఈ కార్యక్రమంలో భానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య, ఇంచార్జ్ మౌనిక, పలువురు టీచర్లు . తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడుగా రామకృష్ణ

ప్రజాశక్తి -పుంగనూరు: ఆదివాసి ఎరుకల సేవా సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షునిగా ఎం రామకృష్ణను నియమించినట్లు అయన మంగళవారం పేర్కొన్నారు. పట్టణంలోని నక్కబండ్ల నివాసం ఉన్న రామకృష్ణను ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ శంకర్ రావు నియామక ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాల అధ్యక్షులుగా ఎన్నుకున్నారన్నారు. ఈ పదవి తనకు ఇవ్వడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. సామాజిక తరగతి అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా వారికి అండగా ఉంటానని ప్రభుత్వం నుండి వారికి రావలసిన పథకాలు కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు. నూతన అధ్యక్షునిగా నియమించడంతో పుంగనూరు అంబేద్కర్ భవనంలో ఎరుకల కుల నాయకులు,

రామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

మహిళలు, బహుజన నాయకులు ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్ అశోక్ ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుమిత్ర రమణ, జేవి నాగరాజు, మునికృష్ణ, శేషాద్రి, నరసింహులు, పార్వతమ్మ, రవణమ్మ, నాగరాజా, బాలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం

జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ వెంకట ప్రసాద్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండొచ్చని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆరిమాకుల పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎం ఎస్ఎంఎ పథకంలో ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులకు పౌష్టికాహారం దానివల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సకాలంలో భోజనం చేయాలని, మందులు వేసుకోవాలని, పరిసరాలలో లభించే ఆకుకూరలు, పాలు, కోడిగుడ్లు, తాజా పౌష్టికాహారాలు తీసుకోవాలని సూచించారు. గంగాధర నెల్లూరు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌరీ, డాక్టర్ బాలాజీ చరణ్, రెడ్ క్రాస్

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

సంస్థ సభ్యులు పాపిరెడ్డి, వైద్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు

బాల్యవివాహాలు అడ్డుకుందాం

ముగిసిన కిశోరి వికాసం

ప్రజాశక్తి -సోమల: బాల్య వివాహాలను అడ్డుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జయసింహ పేర్కొన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మండలంలో వేసవి సెలవులలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సోమల సచివాలయంలో కిశోరి వికాసం ముగిసింది. ఈ సందర్భంగా 'బాల్యవివాహాలను అడ్డుకుం దాం..' అంటూ పలువురు పిలుపు నిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జయసింహ మాట్లాడుతూ బాల్యవివాహాలను అడ్డుకోకుంటే భవిష్యత్తులో మరింత అనర్థాలు జరిగే అవకాశం వుందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సరైన వయసులో వివాహాలు జరిపించాలని కోరారు. వెలుగు ఏపీఓ శివ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టి సమాజాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ఐసిడిఎస్ సూపరువైజర్ హరిత మాట్లాడుతూ గత నెల రెండవ తేదీ ప్రారంభించిన కిశోరి వికాసం జూన్ 10వ తేదీతో ముగిసిందని ఈ సందర్భంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలలో కిశోర బాలికలకు పలు రకాల సూచనలు ,

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి

సలహాలు అందించామని బాలికల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ బాల్యవివాహాలు చేయకుండా సరైన వయసులో వివాహాలు జరిపించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ అమరనాథ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని పెదచెల్లరగుంటలో నిర్వహించిన కిశోర వికాస్ ప్రోగ్రామ్ లో డాక్టరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించ కూడదని, అలా చేసిన వారు శిక్షార్హులన్నారు. బాల్య వివాహాల వల్ల వచ్చే రక్తహీనత , నెలలు నిండకుండా ప్రసవం జరగడం, గర్భాశయం లోనే బిడ్డ చనిపోవడం వంటి ప్రమాదాలు జరుగుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు అరుణ్ కుమార్, సిహెచ్‌ఓ జయంతి, ఏఎన్ఎం పాపమ్మ, ఆశ కార్యకర్తలు లావణ్య , అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లిలో

పొలం దారిని తొలగించారు..

- నాయకుల అండదండలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన తహశీల్దారు
- న్యాయం చేయాలని బాధిత రైతు వినతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: తాను కొనుగోలు చేసిన పొలంలో పాత దారిని నాయకుల అండదండలతో కొందరు తొలగించారని క్షేత్ర స్థాయిలో తహశీల్దారు దీన్ని పరిశీలించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వెంటనే స్పందించి తమకు దారి సౌకర్యం కల్పించాలని బాధిత రైతు కోరాడు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పాతపేట గ్రామానికి చెందిన సుధాకర్ శెట్టి తన పొలంలో సొంత ఇల్లు నిర్మించుకున్నాడు. దీనికి 2023వ సంవత్సరం ఇంటికి దారి కోసం నరసింహులు శెట్టి వద్ద 163/3 సర్వే నంబర్లు 50 వేల రూపాయల పెట్టుబడితో80 అడుగుల పొడవు పది అడుగుల వెడల్పు దారి కొనుగోలు చేశాడు. అప్పటినుండి దారి సమస్య లేకుండా రాకపోకలు నిర్వహిస్తూ ఉండేవాడినని కానీ సోమవారం ఓ వ్యక్తి ఈ దారి స్థలం 'మేము కొనుగోలు చేశాం..!' అని చెప్పడంతో దౌర్జన్యం చేసి జైసిపి సహాయంతో ఉన్నదారిని గుంతల మయంగా రాకపోకలకు అంతరాయం కలిగించేలా మార్చాడు ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఫలితం లేదని సుధాకర్ రెడ్డి ఆవేదన చేస్తున్నాడు. ఈ విషయమై బైరెడ్డిపల్లి తహశీల్దారుకు గ్రామానికి చేరుకుని సమస్యను చూసినా సర్వేయర్‌ను పిలుచుకున్నామని

చూసీచూడనట్లు వ్యవహరి స్తున్నారని, వెళ్లినట్లు స్థానిక ఫిర్యాది సుధాకర్ శెట్టి తెలిపాడు. దీనిపై తహశీల్దారుపై విచారణ కోరగా త్వరలోనే సర్వేయర్ ద్వారా సర్వే చేయించి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

పూసల రవికి సేవారత్న అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - పలమనేరు: మంగళవారం మధ్యాహ్నం విజయవాడలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మదర్ థెరిసా సోషియల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ పలమనేరు పూసల రవి అందించిన సేవలను గుర్తించి సేవా రత్న స్టేట్ అవార్డును ఆ సంస్థ చైర్మన్ కృష్ణమూర్తి అందించారు. ఇందుకు పూసల రవి మదర్ థెరిస్సా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పేద ప్రజలకు, బడుగు, బలహీన వర్గాల వారి అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. సంచార జాతుల కు రిజర్వేషన్ కల్పించాలని కోరారు.